PV Sindhu

కలలు కనండి... ఆ కలల్ని సాకారం చేసుకోండి అన్నారు... భారతరత్న, మిస్సైల్ మ్యాన్ డా. ఎపిజె అబ్దుల్ కలాం. ఎనిమిదేళ్లకే రాకెట్ పట్టుకుని కలగన్న ఒక అమ్మాయి... ఇరవయ్యేళ్లకి ఒక అత్యున్నత క్రీడా వేదికమీద నిలబడి... 120 కోట్ల భారతీయుల కలను సాకారం చేసింది. మువ్వెన్నల పతాక రెపరెపల్లో జాతి మురిసిపోయేలా చేసిన ఆ యువ క్రీడాకారిణి ఎవరోకాదు... వరల్డ్ బ్యాడ్మింటన్ స్టార్.. ఒలింపిక్ పతక విజేత.. మన తెలుగమ్మాయి పుసర్ల వెంకట సింధు. పి.వి.సింధు.

1995 జులై 5న హైదరాబాద్‌లో జన్మించిన సింధు ఇప్పుడు ప్రపంచానికి స్ఫూర్తి నిచ్చే ఒక విజేత. తండ్రి అర్జున అవార్డ్ గ్రహీత పి.వి.రమణ, తల్లి విజయ. ఇద్దరూ వాలీబాల్ ప్లేయర్స్ కావడంతో సాధారణంగానే సింధుకి ఆటపట్ల మక్కువ ఏర్పడింది. కానీ ఆట మారింది. పొడవుగా ఉన్నవాళ్లంతా వాలీబాల్, బాస్కెట్ బాల్ ఆడితే ఇండియాకు అనిల్ కుంబ్లే లాంటి స్పిన్నర్ దొరికేవాడే కాదు. 2001లో ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌గా నిలిచిన పుల్లెల గోపిచంద్ స్ఫూర్తిగా... గొప్ప బ్యాడ్మింటన్ స్టార్ కావాలనే ఆలోచన సింధులో మొలకెత్తింది. ప్రాక్టీస్ కోసం రోజుకి 120 కిలోమీటర్లు ప్రయాణం చేస్తూ... మధ్యలో స్కూల్‌కి వెళుతూ కఠోరసాధన చేసిన ఈ క్రీడాకారిణి... తనను ప్రభావితం చేసిన గోపిచంద్‌కే శిష్యురాలైంది.
2012లో 17యేళ్ల వయసులోనే వరల్డ్ టాప్ 20 లో చోటు సంపాదించుకోవడంతో బ్యాడ్మింటన్ ప్రపంచంలో సింధు పేరు వెలుగులోకి వచ్చింది. ఆ వెంటనే చైనాలో వాల్డ్ ఛాంపియన్‌షిప్ టైటిల్ అందుకుని.. ఆ ఘనత సాధించిన తొలి భారతీయురాలిగా రికార్డు నెలకొల్పింది ఈ తెలుగమ్మాయి. 2016 ఒలింపిక్స్‌లో అద్భుతమైన ఆటతీరుతో ఎదురులేని ప్రతిభను ప్రదర్శించి ఫైనల్ చేరుకున్న సింధు.. దేశానికి రజత పతకం అందించిన తొలి బ్యాడ్మింటన్ క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది.
తాను ఎంచుకున్న ఆటపై ఎంతోమందికి మక్కువ కలిగేలా... అకుంఠిత దీక్షతో ఆడుతూ... అంచెలంచెలుగా ఎదుగుతూ భారతఖ్యాతిని, తెలుగువారి కీర్తిని ప్రపంచ వేదికలపై రెపరెపలాడిస్తున్న పి.వి.సింధుని సాక్షి ఎక్సలెన్స్ అవార్డ్స్-2016 తెలుగు పర్సన్ ఆఫ్ ద ఇయర్‌గా సత్కరిస్తోంది. కంగ్రాచ్యులేషన్స్... అండ్ ఆల్ ద బెస్ట్ టు పి.వి.సింధు.